

# ఓటమిలో గెలుపు

'వింధ్యవాసిని'

సాయంకాలం అయిదు గంట లయింది. ఎమ్. జి. రోడ్ మధ్యలో ప్రత్యేకంగా కనిపిస్తున్న అయిదంతస్తులమేడ గ్రౌండ్ ఫ్లోర్, సింహద్వారం పైనున్న తెల్లని సైన్ బోర్డు మీద అక్షరాలు అస్తమించబోతున్న సూర్యుడి కిరణాలు పడి బంగారు రంగులో మెరుస్తున్నాయి. "విక్టరీ అడ్వర్టయిజింగ్ కంపెనీ లిమిటెడ్" అనే పెద్ద అక్షరాల మొదటి వరుస కిందుగా, ఒక వైపు 'విక్టరీ ఈజ్ అవర్ అయిడియల్—సర్వీస్ ఈజ్ అవర్ మోటో' అనీ, మరో వైపు రిజిస్టర్డ్ హెడ్ ఆఫీస్, ఎమ్. జి. రోడ్, బెంగుళూరు అనీ ఇంగ్లీషులో రాసి ఉంది.

అప్పుడే కంపెనీలోంచి బయటి కొచ్చిన రఘురాం అటూ ఇటూ చూసి రోడ్ క్రాస్‌చేసి, రోడ్ కవతల పార్కింగ్ లాట్‌కేసి నడిచాడు. అతను వేసుకున్న క్రీజ్ రెసిస్టెంట్, బ్రౌన్ టెరీవూల్ సూట్ టెక్కు చెదరకుండా ఉండి, వేసుకున్న మనిషి ఖరీదునీ, స్టేటస్‌నీ చూపిస్తూంది. దానికి మాచింగ్‌గా కట్టుకున్న చిన్న తెల్ల డాట్స్ బ్రౌన్ టై వాట కొద్దిగా లూజ్ అయి ఉంది. అలవాటుకొద్దీ ఒకసారి ముద్దుగా పెంచుకున్న తుమ్మెద రెక్క మీసాల్ని సవరించుకుని, టై సర్దుకుంటూ, మరో చేత్తో తన క్రీమ్ కలర్ స్టాండర్డ్ కారు తలుపు తెరుచుకుని స్టీరింగ్ ముందు కూర్చున్నాడు రఘురాం.

కారు స్టార్టు చేయబోతూ, ఒకసారి అటు వైపుగా పార్కు చేయబడిఉన్న ఆలివ్ గ్రీన్ అంబాసడర్ వైపు చూసి, 'డామిట్' అనుకున్నాడు. ఆ చూపులో ఆ కారు తాలూకు యజమాని, తన తండ్రి, విక్టరీ అడ్వర్టయిజింగ్ కంపెనీ లి., జనరల్ మేనేజర్ అయిన రాజరత్నం గారిపై అతగాడి మనసులో మధ్యాహ్నం నించీ రగులుతున్న కోపమంతా ప్రతిబింబిస్తూంది. గేర్ మార్చుకుని, మెల్లిగా రోడ్‌లో బిజీ ట్రాఫిక్ లోకి పోనిచ్చాడు కారుని. ఆ కారు కొని సంవత్సరం కూడా కాలేదేమో, మెత్తగా, నిశ్శబ్దంగా ముందుకి పోతోంది.

రెండో ట్రాఫిక్ సర్కిల్లో కుడివైపుగా బ్రిగేడ్ రోడ్‌లోకి తిప్పి, ఖోలే లిక్కర్ షాప్ ముందు ఆపేడు కారుని. రఘురాం కారుని చూడగానే పరిగెత్తి వచ్చిన కుర్రాడి చేతికి వంద రూపాయల నోటు ఇచ్చి, ఒక పీటర్ ప్యాక్ తెమ్మని పురమాయించాడు. కొన్ని సెకన్లలో తిరిగొచ్చాడు కుర్రాడు. మూరెడు పొడ ఉన్న బ్రౌన్ పేపర్ పార్సిల్ అందుకుని, వాడి చేతిలోంచి నోట్లు మాత్రం అందుకుని ముందుకి సాగిపోయాడు.

కారు డ్రైవ్ చేయటం మనేది ఆటోమేటిక్‌గా జరిగిపోతోంది. ఎంతో నీరసంగా, మెదడంతా మొద్దుబారినట్లుగా ఉంది రఘురాంకి. సాయంత్రపు బిజీ ట్రాఫిక్ దాటి, ఇరవై నిముషాల్లో ఎలా ఇల్లు చేరాడో తనకే తెలీదు.

కారు అంత దూరంలో ఉండగానే మెయిన్ గేటు తెరుచుకుంది. అందులోంచి ఇంటివైపుగా దూసుకు పోతున్న కార్లోంచి మర బొమ్మలా సెల్యూట్ చేస్తున్నవాచర్ని గమనించలేదు రఘురాం. ఇలాంటి అతి మామూలు విషయాల్ని గమనించే ఓపిక ఆతనిలో ఇవాళ.

కారుని పోర్టికోలో ఆపి మెల్లిగా తల వంచుకుని మెట్లెక్కేడు. తన గదిలోకి వెళ్ళేక గానీ గుర్తు

రాలేదు అరుణ ఇంట్లో ఉండదని. మధ్యాహ్నం ఫోన్‌చేసి చెప్పింది, మిసెస్ దేశ్‌పాండేతో 'ది గ్రేట్ గాంబ్లర్' చూటానికి వెళుతున్నానని. అసలా విషయమే మరిచి పోయేడు. పోనీ తను లేకపోవటమే మంచిదయింది అనీ అనుకోక పోలేదు రఘురాం. ఇలాంటి పరిస్థితిలో భార్యకి ముఖం చూపించి, విషయాన్ని వివరించటం అంటే ఎంబరేసింగ్‌గా ఉంది ఆతనికి.

కోట్ బటన్స్ విప్పబోతూ, బటన్ హోల్ ఉదయం అరుణ ఉంచిన బ్లూ కార్నేషన్ చేతిలోకి తీసుకున్నాడు. వడలి వాడిపోయి ఉందది. డస్ట్‌బిన్‌లో పడేసి, బట్టలు మార్చుకున్నాడు. స్లిప్పర్స్‌కోసం వెతుకుతోంటే, కార్లో అతను వదలి వచ్చిన బ్రౌన్ పేకెట్‌తో వచ్చాడు రామస్వామి. తలపాగా సవరించు కుంటూ, హడావిడిగా టేబిల్ కిందుగా ఉన్న స్లిప్పర్స్ లాగి అయ్యగారి పాదాల కందించాడు.

"స్నానం చేస్తారా, బాబూ? కాఫీ, టిఫిన్ తేనా?"

"నాకేం వద్దు. రెస్ట్ తీసుకోవాలి. ఎవరొచ్చినా నన్ను డిస్టర్బ్ చేయవద్దు" అనేసి ముఖం తిప్పేసు కున్న అయ్యగారి వైపు అనుమానంగా చూశాడు రామస్వామి. 'అంటే ఏదో జరిగింది. ఈయన మనసు బాగోలేదు. ఇప్పుడీ మూరెడు సీసాని ముందుంచుకుని కూచుంటాడు కాబోలు. ఏమో, పెద్దవాళ్ళ విష యాలు నాబోటి వాడి కేం అంగరందుతాయి' అను కుంటూ, తలుపు వేసుకుని అవతలికి పోయేడు.

గంటసేపెలా గడిచిందో తెలీదు రఘురాంకి. గది మధ్యలో ఉన్న పెద్ద సోఫా ఒక చివర్లో కూచుని ఉన్నాడు. తల చెదిరి ఉంది. కళ్ళు ఎర్రబారివాయి. గదిలో ఫేన్ తిరుగుతున్నా, నుదుటి మీదంతా చెమట పట్టి ఉంది. ఎదురుగా టీపాయి మీద పావుభాగం ఖర్చయిపోయిన పీటర్ స్కాట్, ఒక గాజు గ్లాసు, నాలుగయిదు సోడా సీసాలు ఉన్నాయి.

అరుణ వచ్చేసట్లుంది. కార్లో ఇంటి దగ్గర డ్రాప్ చేసిన మిసెస్ దేశ్‌పాండేని ఆమె ఇంట్లోకి రమ్మని ఆహ్వానించటం, ఆవిడ ఇప్పుడు కాదు,మరోసారని పొలైట్‌గా వీడ్కోలు తీసుకోవటం, కారు వెళ్ళి పోయిన చప్పుడు—అన్నీ లీలగా తెలుస్తూనే ఉన్నాయి రఘురాంకి.


ఇంకొక్క క్షణంలో వచ్చేస్తుంది. ఆమె వచ్చి, ఏం జరిగిందని అడగాలనీ, తను అంతా వివరించి మధ్యాహ్నం నించీ మోస్తున్న ఆలోచనల భారాన్ని దించుకోవాలనీ ఉం దతనికి. కానీ ఏమిటో ఆమె ముందు ఇలాంటప్పుడు ఆదొక లాంటి ఇన్‌ఫీరి యారిటీ ఫీలవుతాడు—ఆమెకున్న చాకచక్యం, మనో నిబ్బరం తనకి లేకపోవటం చేతనేమో.

"చిన్నయ్యగా రొచ్చేరా?" అడుగుతోంది అరుణ.

రామస్వామి "ఆఁ! వచ్చి గంట పైనే అయింది. వంట్లో బాగులేదేమో. కాఫీ కూడా వద్దన్నారమ్మా" అని చెబుతున్నాడు.

చప్పుడు కాకుండా తలుపు తెరిచి లైట్ స్విచ్ ఆన్ చేసింది. సరిగా గది మధ్యలో బిగించబడిన జాన్‌సన్స్ ఫిట్టింగ్‌లోని డబుల్ ట్యూబ్‌లైట్ చప్పున వెలిగింది.అంతసేపూ చీకట్లో కూచుని ఉన్నా డేమో వెలుతురుకి తట్టుకోలేని వాడిలా ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు.

రఘురాం తాగుబోతేం కాదు. క్లబ్బులకీ, పబ్లిక్



శిల సముచ్ఛయం ఫోటో—ఆర్. ఉదయభాస్కర్ (తి.ఎం.పల్లి 14)

ప్లేసెస్‌కి వెళ్ళి తాగే అలవాటు అసలు లేదు. ఎప్పుడో ఇలా మనసు బాగులేనప్పుడు, ఒంటరిగా ఇంట్లో ఒక్కడే కూచుని పుచ్చుకుంటాడు. ఎంత తాగినా సరే, అరుణ ఎదురుగా వచ్చిందంటే మత్తంతా దిగి, మామూలుగా అయిపోతాడు. అందుకే, అత గాడికి తనంటే ఉన్న గౌరవానికే గర్వంగా ఉంటుంది అరుణకి.

నోరు విప్పి ఒక్క మాటయినా మాట్లాడకుండా లిక్కర్ బాటిల్ మూత బిగించి మొదట అలమారులో పెట్టేసింది. తర్వాత రఘురాం చేయి పట్టి, బాత్ రూమ్‌లోకి తీసుకెళ్ళింది. వాష్ బేసిన్‌లో టేప్ విప్పి, ముఖం కడుక్కోమంది.

అతను ఇవతలి కొచ్చి కూచోబోగానే రెడీగా కాఫీ కప్పు అందించింది. రూమ్ మొత్తం పరిచి ఉన్న పసుపు, ఎరుపు గళ్ళ కార్పెట్‌లోని గళ్ళ వైపు పాలో పనగా చూస్తూ కాఫీ తాగేడు.

అరుణ ఏం జరిగిందని అడుగుతుందేమోనని ఆత్రతగా ఉం దతనికి. ఆమె తను కూడా కాఫీ తీసుకుని, కాస్త ఫ్రెషప్ అయాక వార్డ్ రోబు లోంచి వైట్ పోలిస్టర్ పేంటు, మెరూన్ రెడ్ నైలాన్ టీ షర్ట్ అందించింది అతనికి వేసుకొమ్మని.

ఇద్దరూ కలిసి కారెక్కారు. తనే డ్రైవ్ చేస్తూ, కబ్బన్ పార్క్ వైపుగా పోనిచ్చింది అరుణ. విధాన సౌధ ముందు విశాలమయిన లాన్స్‌లో ఒక మూలగా కూచున్నా రిద్దరూ. కర్చీఫ్ పరుచుకుని ఒక కాలు ముందుకు చాచి కూచుని, అరుణ వైపు చూశాడు రఘురాం. ఆమె తెలుపు, నలుపు పువ్వుల అమెరికన్ జార్జెట్ చీర, మేచింగ్ బ్లాక్ బ్లౌజ్ వేసుకుని ఉంది. జాకెట్‌కీ, చీరకీ మధ్య అం[illegible] వేళ్ళ వెడల్పు కనిపిస్తున్న భాగమంతా అక్కడక్కడ [illegible] లాన్స్‌లో అప్పుడే వెలుగుతున్న లైట్ల వెలుతురులో పచ్చగా మెరుస్తూంది. వచ్చే ముందే బారెడు జడలో తురుము కున్న మల్లెపూలు వాసనలు వెదజల్లుతున్నాయి. రఘురాం ఇవేవీ గమనించే స్థితిలో లేడు అని తెలుసు అరుణకి. అయినా ఎప్పుడూ ట్రిమ్‌గా ముస్తా బవటం, ఏక్టివ్‌గా మూవ్ కావటం ఆమెకి అలవాటు.

"ఇప్పుడు చెప్పండి, అసలేం జరిగిందో. అంతగా దిగజారి పోయారేం? ఆఫీసులో ఏదయినా గొడవ. . ." మధ్యలోనే ఆపేసింది అరుణ. అతని కుడి చేయి అరుణ చేతుల్లో ఉంది. ఆ చేతుల్లోంచి వస్తున్న శక్తి ఏదో తన లోని నీరసాన్ని మెల్లిగా పోగొ[illegible]న్నట్లనిపిం చింది. కళ్ళలో ఏ భావమూ కనిపించనీయకుండా చిరు గాలికి చిన్నగా ఎగురుతున్న ఆమె ముంగురుల వైపే అదే పనిగా చూస్తూ, "మద్రాసు బ్రాంచీ మేనేజర్ పోస్ట్‌కి కాండిడేటు కావాలని ప్రకటన వేశారు ఇవాళ 'పేపర్స్‌లో'" అన్నాడు కూల్‌గా.

తను వింటున్నది నిజమా, కాదా అన్న మీమాంసలో పడింది అరుణ.

"ఎందుకు, ఎందు కలా చేశారు? నెల రోజులవాడు ఆ పోస్ట్‌లో ఉన్న రంగప్పగారు రిటైర్‌మెంటు

పుచ్చుకుంటే, అది మీాకే ఇస్తారని. . ."

"ఇస్తారని మన మనుకున్నాం. ఆయనేం అనలేదుగా!"

"అయితే మాత్రం ఇంత అన్యాయమా? అప లాయన అంతర్య మేమిటో సూటిగా అడిగేస్తే సరి. మీారూరుకోండి. రాత్రి డిన్నర్ టైమ్‌లో ఎలాగో కదిపి తీరతాను."

"పేపర్లో చూసిన వెంటనే అడగకుండా ఉండలేక పోయాను. అప్పటికప్పుడు ఆయన గదిలోకి వెళ్ళి సూటిగా అడిగేశాను. . ."

"మరి, ఏమన్నారు?".

* * *

ఉదయం ఆఫీసుకి వెళ్ళగానే సిటీలో వచ్చే న్యూస్ పేపర్లన్నిట్లో తమ కంపెనీ పబ్లిసిటీలో వచ్చే ప్రకటనలన్నీ ఒకసారి చూడటం రఘురాం మొదట చేసే పని. అతను ఎమ్. కామ్. పాసయినాక ఎమ్. బి. ఎ. డిగ్రీ పుచ్చుకుని మూడేళ్ళయింది. ఏడాది క్రితం పెళ్ళయింది. మూడేళ్ళ నించీ కంపెనీ ఆఫీసుకి ప్రతి రోజూ టంచన్‌గా వచ్చి, ఆఫీసు అవర్స్ అన్నీ అక్కడే గడుపుతున్నాడు. ఈ పనీ, ఆ పనీ అని లేకుండా, అడ్వర్టయిజింగ్ కంపెనీ అన్ని సెక్షన్స్ లోనూ కొన్ని రోజుల పాటు ట్రెయినీ అవుతున్నాడు. అయితే ఇదంతా తండ్రి రాజరత్నం గారి బలవంతం మీాదనే.

ఆయనికి తన కొడుకు కదా అని, ఒకేసారి హయ్యర్ లెవెల్‌కిపుష్‌చేయటంఇష్టం లేదు. కంపెనీతనొక్కడిదీ కాదు. అందులో ఇంకా ఆరు మందిపార్ట్‌నర్స్, వంద మంది షేర్ హోల్డర్స్ ఉన్నారు. అందరి పెట్టుబడి మీాద నడుస్తున్న సంస్థని, తన భాగం మొత్తంలో 30 శాతం అయినప్పటికీ, తన పలుకుబడి ఉపయో గించటం ఇష్టం లేదు రాజరత్నంగారికి. ఆయనొక స్ట్రిక్ట్ బిజినెస్ మాన్. జనరల్ మానేజర్‌గా కంపెనీ లాభ నష్టాలు సరి చూసుకోటమే ఆయనకి ముఖ్యం. అందుకనే ఒక పోస్ట్ అని ఇవ్వకుండా ట్రెయినింగ్ పేరుతో మూడేళ్ళుగా పని చేయిస్తున్నాడు కొడుకుతో.

ఆ వేళ మామూలుగా తనకై కేటాయింపబడిన ఆఫీస్ గదిలోకి వెళ్ళి, రివాల్వింగ్ ఛెయిర్‌లో రిలాక్స్ అయి, ఆ మధ్యలో ఫస్ట్ వెడ్డింగ్ ఏనివర్సరీకి అరుణ ప్రెజెంట్ చేసిన గోల్డ్ సిగరెట్ కేస్ విత్ లైటర్ని బయటికి తీశాడు. నిండుగా ఉన్న గోల్డ్ ఫ్లేక్ సిగిరెట్స్‌లోంచి ఒకటి తీసి వెలిగించుకుని, కోట్ బటన్స్ విప్పి కూచున్న కొద్ది క్షణాల్లో అప్పుడే ఆన్ చేసిన ఎయిర్-కండిషనర్ చల్లదనం శరీరానికి తెలుస్తూంది.

ఉదయం తను నిద్ర లేచేసరికి తొమ్మిదవుతుంది. అప్పటికే రాజరత్నంగారు ఇల్లు వదిలి ఉంటారు. అందుకని ఆఫీసుకిరాగానే మొదట ఇంటర్ కమ్‌లో తండ్రిని పలకరించి,విష్ చేయటం అలవాటు రఘురాంకి.

ఎప్పటిలాగానే రిసీవర్ చేతిలోకి తీసుకుని, అవతల తండ్రి "హలో. . ."అనగానే, "హలో, డాడీ,గుడ్ మార్నింగ్" అన్నాడు. ఆఫీసు అవర్స్‌లో, ఆఫీసు ప్రెమిసిస్‌లో తండ్రితో మాట్లాడాలంటే ఎందుకో కొత్తగా ఉంటుంది రఘురాంకి. అందు క్కారణం

## పునాది

అభ్యుదయోద్యమానికి<br>
విప్లవోద్యమానికీ<br>
మార్క్సిస్టుతత్త్వమే పునాది<br>
పెట్టుబడిదారీ సమాజానికి<br>
అదే నిర్మించగలదు<br>
సమాధి

\- ఎల్లోరా

ఇక్కడ చేరగానే ఆయనలో లోపించే హోమ్లీనెస్ కావచ్చు.

"ఓ రఘూ! వెరీ గుడ్‌మార్నింగ్. ఇప్పుడేనా వచ్చింది? ఒక్క నిమిషం ఆలస్యం చేసింటే యూడ ఉడ్‌హావ్ మిస్డ్‌మీా.హోటల్ సవేరాలోఒక మీాటింగ్ అటెండ్ అవాలి. ఇదుగో ఇప్పుడే బయలుదేరు తున్నాను. ఒకె గుడ్‌బై"అన్నారు గబగబా. ఒకటే వేగం.

ఆఫీసు పనిలో పడితే, పరుగు లెత్తటమే కానీ, మామూలుగా నడవటం అంటూ ఉండ దీయనకి. అనుకుంటూ టేబిల్ మీాద కుడివైపుగా ఒక ట్రేలో నీట్‌గా పేర్చి ఉన్న ఫ్రెష్ న్యూస్‌పేపర్స్ లోంచి మొదటగా ఉన్న 'డెక్కన్ హెరాల్డ్'తీశాడు. మామూలుగా ఫస్ట్ పేజీ టాప్ రైట్ అండ్ లెఫ్ట్ కార్నర్స్‌లో వచ్చే వి. జి. పన్నీర్‌దాస్ అండ్‌కో వాళ్ళవి ఆంగ్రో గ్లూకోజు బిస్కట్స్‌వి ప్రకటనలు చూశాడు క్యాజువల్‌గా.

ఆవాళ న్యూస్ హెడ్‌లైన్సన్నీ ఒక్కసారి చదివేసి రెండో పేజీలోనికి వచ్చాడు. అందులో చూడాల్సిం దేమీా లేదు. మూడోది అపాయింట్‌మెంట్స్ పేజి అందులో రెండు, మూడు బాక్స్ ఏడ్స్ చూశాక సడన్‌గా ఒక ప్రకటన అతని చూపుల్ని అలాగే ఆపేసింది. వాంటెడ్ జనరల్ మేనేజర్‌ఫర్ అవర్, బ్రాంచ్ ఆఫీస్ ఎట్ మద్రాస్ అనిపెద్ద అక్షరాలు. వాటి కిందుగా చిన్న అక్షరాల్లో జాబ్ రిక్వైర్ మెంట్స్, ఎక్స్‌పీరియన్స్ అన్నీ రాసిఉన్నాయి. చివరగా ఎన్ ఎఫిషియంట్ అండ్ డైనమిక్ పర్సన్ ప్రిఫర్డ్, ఎప్లై – జనరల్ మేనేజర్, విక్టరీ అడ్వర్టయిజింగ్ కంపెనీ లిమిటెడ్, ఎమ్. జి. రోడ్,బెంగుళూరుఅని ఉంది. అక్షరాల వెంట వేగంగా పరుగులు తీశాయి రఘురాం చూపులు ఒక్కసారి. నిజామా, కాదా. అన్నట్లు మరో సారి చదివాడు. తల వంచుకుని వెళుతూ, తలుపు ఉందనుకుని, గోడను ఢీకొన్నంత షాక్ తిన్నాడు.

"ఎందుకు, ఎందుకిలా చేశారు? డాడీ నాతో మాటయినా అనలేదే?" అని ప్రశ్నించుకుంటూ ఏం చేయాలో తోచనివాడిలా పేపర్ పక్కన పడేసి 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'అందుకున్నాడు. అల వాటుగా పేజీలు తిరగేస్తే, నాలుగో పేజీలో మళ్ళీ ప్రత్యక్షం అదే ప్రకటన. కోపంగా పేపర్ని టేబిల్ మీాంచి కింద పడేలావిసిరి కొట్టాడు.

ఇంక చదవలేకపోయాడు. 'ఏమయినా సరే ఈ విషయం అంతు తేల్చుకోవలసిందే.భయపడుతూ కూర్చుంటే ఎన్నాళ్ళయినా ఇలా ఉదయం నించీ సాయంకాలం దాకా టాయిలింగ్ తప్పేట్టు లేదు. ఉండదు. అడిగేస్తాను డాడీని' అనుకుని ఆయన ఫ్రీగాఉన్నారేమో చూద్దామని ఫోన్‌ఎత్తబోయేలోగా గుర్తొచ్చింది, ఆయన అంత క్రితమేమీాటింగ్‌కి వెళ్ళిన విషయం. చేసేదేం లేక నీరసంగా కళ్ళు మూసుకుని కూచుండిపోయాడు.

మీాటింగ్, లంచ్ అయి రాజరత్నంగారు ఆఫీసు కొచ్చేసరికి రెండున్నరయింది. రఘురాంకి ఆకలికూడా అనిపించ లేదు. రెండు సార్లు ఫ్లాస్క్‌లో ఉన్న కాఫీ పోసుకునితాగాడంతే. కోట్‌బటన్స్ పెట్టుకుని, ఒకసారి క్రాపు, టై సర్దుకుని బయలు దేరాడుగా, జి. ఎమ్. రూమ్‌కి.

ఎప్పుడూ డాడీతో ముఖాముఖి మాట్లాడే రఘురాం కివాళ ఏదో తెగింపు వచ్చేసింది. ఉపోద్ఘాత మేమీా లేకుండా సూటిగానే అడిగేశాడు.

"అయామ్ సారీ టు అస్క్ లైక్ దిస్. ఇంకా ఎన్నాళ్ళిలా ట్రెయినింగ్ అవాలి నేను?" అన్నాడు.

సాలోచనగా కొడుకు ముఖం లోకి చూశారు రాజరత్నంగారు."ఇప్పుడు హఠాత్తుగాఎందుకొచ్చింది సందేహం?" అన్నట్లుగా ఉన్నాయా చూపులు.

"ఆహ అది కాదు. ఇప్పటికి మన కంపెనీలో ఆల్‌మోస్ట్ అన్ని డివిజన్స్‌లో పని చేశాను కదు. మద్రాసు బ్రాంచ్ మేనేజర్‌కి పై మనిషి కావాలని ప్రకటించా రెందుకో తెలుసుకుందామని."

"ఈ కంపెనీ నా ఒక్కడిదే స్వంతం కాదనీ, నా ఇష్టానుసారం ఎపాయింట్‌మెంట్స్ చేయలేనని నీకు తెలుసనుకుంటాను. . ."


"అది కాదు, డాడీ! మీారు చేసిన ప్రకటన ప్రకారం క్వాలిఫికేషన్, కొంతవరకూ ఎక్స్‌పీరియన్స్ నాకూ ఉన్నాయి కద! నా పేరు సజెస్ట్ చేసి బోర్డ్ మెంబర్స్‌ని ఒప్పించలేరా మీారు? ఏమిటో మీా మనసులో ఏముందో అర్థం కాదు. దయచేసి సస్పెన్స్‌లో పెట్టకుండా క్లియర్‌గా చెప్పండి."

కొడుకు ఇంత ధైర్యంగా, సూటిగా తన్ని ప్రశ్నించటం ఇదే మొదలు. అందుకాయనకి సంతోషమే కానీ, కోపం రాలేదు.

"ఓకే! అసలు విషయం చెబుతాను. హర్ట్ అవవు కదూ? నెల రోజుల క్రితం మన సేల్స్ సూపరింటెండెంట్ ఆపరేషన్ అయి సెలవు పెడితే, అందులో ఇన్—చార్జిగా నిన్ను వేశాను. కానీ ఈ నెల రోజుల్లో రొటీన్, ఆఫీస్ డెస్క్ వర్క్ తప్పితే ప్రాక్టికల్‌గా నువ్వేదయినా స్వంతంగా ఎచీవ్ చేసి చూపించావా ఊహూఁ లేదు." ఒక్క క్షణం పాటు ఆగి కొడుకు వైపు చూశారు.

ఏం చెప్పాలో తోచలేదు రఘురాంకి.

"ఒక బిజినెస్ ఆర్గనైజేషన్‌ని మేనేజి చేయాలంటే, జి. ఎమ్. కొడుకు కావటం ఒక్కటే చాలదు రఘూ! ధైర్యంగా, స్వతంత్రంగా, తెలివిగా నిర్ణయాలు తీసుకోగలిగి, డాషింగ్‌గా ముందుకు వెళ్ళగలగాలి. ఇవన్నీ నీలో లేవని నే ననటం లేదు. కొంతమందిబైబర్త్ డైనమిక్ అయితే, మరి కొందరు



ట్రెయినింగ్‌తో, ప్రాక్టీస్‌తో ఏక్టివ్‌గా ఉండటం అలవరచుకుంటారు."

కొడుకు వైపు నించి మాటలు లేకుండా తనే లెక్చర్ ఇస్తున్నట్లుండటం నచ్చలేదు రాజరత్నంగారికి. ఆయన తనేం మాట్లాడినా, అవతలి మనిషి ఒక మాట పొల్లు పోకుండా శ్రద్ధగా వినాలనుకుంటాడు. పైగా కొడుకు మనసు లోని బాధ అతగాడి ముఖంలో తెలుస్తూనే ఉంది. 'ఈ కాలంలో యంగ్ పీపుల్స్‌కి ఓర్పు తక్కువ. గబగబా నిచ్చెన పైకి ఎక్కెయ్యాలను కుంటారు' అనుకున్నారు మనసులో మెల్లగా.

ముందున్న రెండు గజాల వెడల్పు స్టీల్ టేబిల్ గ్లాస్‌టాప్‌లో తేలిగ్గా ప్రతిబింబిస్తున్న కొడుకు ముఖంలోకి చూశారు సాలోచనగా. టేబిల్‌కి ఇటువున్నది రాజరత్నంగారి రివాల్వింగ్ చెయిర్ మాత్రమే. అటు పక్కన, టిప్ అప్‌హోల్‌స్టరీకవర్ అయిన చెయిర్స్ అర డజను న్నాయి. అందులో ఒక దానిలో ఇన్‌కన్వీనియంట్‌గా కూచుని ఉన్నాడు రఘురాం.

గదిలో ఎక్కడ ఉండాల్సిన సామాను అక్కడ కరెక్ట్‌గా ఉన్నాయి. క్రమం తప్పటమనేది ఎందులోనూ ఇష్టపడరు రాజరత్నంగారు. కుర్చీ లోంచి లేచి, ఒక నిమిషం పాటు అటూ ఇటూ పచార్లు చేశారు. ఒక మూలగా ఉన్న డెస్క్ మీదున్న టైప్ రైటర్ కవర్ సర్ది పెట్టారు. అదంటే ఆయనకి ప్రాణం. తను స్వంతంగా ఉపయోగించుకోవటానికని జర్మనీ నించి ప్రత్యేకం తెప్పించుకున్నారు.

తనలో తనే ఏదో నిశ్చయించుకున్న వారిలా తల పంకించారు. వేసుకున్న క్లోజ్ నెక్, గ్రే కలర్ కోట్ లేపెల్ పైన కనిపించని దుమ్ము దులుపుకుని, చెయిర్‌లో కూచున్నారు తిరిగి. నీ "యంగ్‌మాన్. టిస్‌మచ్ ఆ కెన్ డూ. ఆ పోస్ట్‌కి ఎప్లికేషన్స్ వచ్చి, ఇంటర్వ్యూ అవటానికి కనీసం నెల రోజులు పడుతుంది. ఈ నెల రోజుల్లో, నీ కిప్పుడున్న కెపాసిటీలో, కంపెనీ ఇయర్లీ టర్నోవర్‌లో కొంత మార్పును తేగల ఎసైన్‌మెంటు ఏదైనా తేగలవేమో ప్రయత్నించు. రికార్డ్ రూమ్ క్లర్క్‌ని అడిగితే, మనతో ఇప్పుడు కాంట్రాక్ట్స్ ఉన్న కంపెనీలు, వాటిలో త్వరలో ఎక్స్‌పైర్ అయేవి. మంచి ఆదాయా న్నివ్వగల మరింకే ఇతర కంపెనీలు వివరాలన్నీ తెలుస్తాయి నీకు. ఈ లోగా నువ్వు స్పెక్టాక్యులర్‌గా ఏదైనా, చేయ గలిగితే, నిను మద్రాసు బి. ఎమ్. పోస్ట్‌కి రెకమెండ్ చేసేందుకు నేను ఆలోచించాల్సిన అవసరం ఉండదు" అనేసి ఇంక చెప్పాల్సిన దేం లేనట్లు ఇంటర్ — కామ్‌లో తన స్టెనోగ్రాఫర్‌ని రమ్మని పిలిచారు.

రఘురాం కలలో నడుస్తున్న వాడిలా ఆ గది లోంచి బయట పడ్డాడు.

* * *

రాత్రి డిన్నర్ టైమ్‌లో, తండ్రి కొడుకు లిద్దరి మధ్యా మాటలేం సాగలేదు. 'అబ్బాయి అలిగేడు నా మీద' అనుకుని నవ్వుకున్నారు రాజరత్నం. అరుణే మధ్య మధ్యలో మామగారికి కావలసినవి వడ్డిస్తూ మాటలు కలుపుతోంది. మనసులో భావాల్ని మనసులోనే దాచుకోవటం ఆమెకి బాగా తెలుసు.

సాయంత్రం భర్త నోట విన్న మాటలని గురించే సైలెంట్‌గా ఆలోచిస్తోంది ఆమె. అతగాడిలో ఉన్న లోపమల్లా ఒక్కటే. స్టార్టింగ్ ట్రబుల్. అది తప్పించుకున్నాడంటే, అవసరమయినంత వేగంగా వెళ్ళగల శక్తి దాగి ఉంది అతనిలో. దాన్నెలా పైకితీయాలన్నదే ఆమె సమస్య.

వైట్ షీట్స్ పరచిన డబుల్ బెడ్ మీద పడుకుని, సిగరెట్ కాల్చటం అయ్యాక చేతిలో 'టైమ్' మేగజైన్ టీపాయ్‌మీద పడేసి, దిండు మీదుగా బోర్లా పడుకున్నాడు రఘురాం. లైట్ ఆర్పి, బెడ్ లైట్ వేసి పక్కనే చేరింది అరుణ.

పడుకునేముందు హేర్‌స్టయిల్ అంతా తీసి, జుట్టు ఒక రిబ్బనుతో ముడేసుకుని, ముఖం కడిగి లైట్‌గా పౌడర్ పఫ్‌చేసుకోవటం అలవాటు అరుణకి. ఘుమ్మని వస్తున్న లెవెండర్ డ్యూ పరిమళం అరుణ ఉనికిని తెలుపుతోంది రఘురాంకి. మెల్లిగా ఇటు తిరిగి, చూశాడు. తన కిష్టమైన లైట్‌బ్లూ ప్రింటెడ్ నైటీ వేసుకుంది.

ఏం మాట్లాడకుండా అరుణని దగ్గరికి లాక్కుని, ఆమె జుట్టులో ముఖం దాచుకుని పడుకున్నాడు మెల్లగా వినిపించీ వినిపించనట్లుగా అన్నాడు: "రేపట్నించీ ఆ డర్టీ ఆఫీసుకి వెళ్ళను."

"ఉహుఁ! పోనీ ఒక వారం రెస్టు తీసుకోండి. నాకూ ఈ మధ్యన బోర్‌గా ఉంది. హాయిగా కబుర్లు చెప్పుకుంటూ గడిపేద్దాం." అరుణ సీరియస్‌గా అవటం లేదని స్వరాన్ని బట్టి తెలుస్తోంది రఘురాంకి. అందులో ఎగతాళి కూడా కొంచెం ఉందేమోనని అనిపించింది.

"డాడీస్ బోయ్'గా మూడేళ్ళు వెలిగించిన జాబ్ చాలు. ఫెడప్ అయిపోయాను. వేరే ఏదైనా ఫరమ్‌లో ట్రై చేద్దామనుకున్నా ..." ఏమంటావ్ అన్నట్లు చూస్తూ లేచి మంచం మీద బాసింపట్టు వేసుకుని కూచున్నాడు.

"చేయొచ్చు. ప్రయత్నిస్తే ఏదో ఒకటి రాక పోదు. కానీ మామయ్యని కాదని వేరే ప్రయత్నిస్తే ఆయన ప్రెస్టీజి...."

"హుఁ! నా ప్రెస్టీజికోసం ఆయ నేమయినా చేస్తున్నారా అని ఆలోచించవేం నువ్వు?" కోపంగా అన్నాడు.

"అయినా ఒక మాట అడుగుతా—కోపం రాదు కదూ? మామయ్య చెప్పినట్లు ప్రాక్టికల్ వర్క్‌కి ప్రయత్నించి చూస్తేనేం?" హెసిటేట్ చేస్తూ అంది అరుణ.

వింతగా చూశాడు రఘురాం. "నీ కేమయినా మతి పోయిందా? అసలది జరిగే పనేనా? ఎంతో అనుభవమూ, ఇంటలిజన్సూ ఉన్న వాళ్ళు తప్ప టెలిఫోన్‌ద్వారా బిజినెస్ డీలింగ్స్ సెటిల్ చేయలేరు. అలాంటివి..." ఒక క్షణం ఆగితే, అరుణ చూపుల్లో భావమేదో అర్థమయినట్లనిపించింది. "డైరెక్ట్‌గా వెళ్ళి ఎప్రోచ్ చేయాలనా ... నా సంగతి తెలిసే ఇలా సలహా ఇస్తున్నావా?"

"ఏమిటండీ అదేదో పెద్ద కొండను కదిలించటమయినట్లు మాట్లాడతారే. మీరు కొత్తవారితో ఫ్రీగా మాట్లాడలేరు ... బిజినెస్ సర్కిల్స్‌లో మీకు రాజరత్నం గారి కొడుకుగా తప్పితే వేరే రికగ్నిషన్ లేదు. ఇవేకదా డ్రాబాక్స్ ... ప్రస్తుతం మీరున్న పొజిషన్ మరోలా వూహించి చూసుకోండి. విక్టరీ అడ్వర్టయిజింగు కంపెనీలో ఏదో ఒక మామూలు సేల్స్‌మన్ [illegible] అనుకోండి. మీ జి. ఎమ్. మీ కొక లిస్ట్ ఇచ్చి, కొంత టైమ్ ఇచ్చి, అందులో ఉన్న కాంట్రాక్ట్స్ అన్నీ సెటిల్ చేయలేకపోతే రిజైన్ చేయమని చెప్పేరు. అప్పుడు మీరేం చేస్తారు? వెంటనే రిజైన్ చేసేస్తారా? నిదానంగా భర్త ముఖంలో రియాక్షన్ గమనిస్తూ ఒక్కొక్క మాటే అన్నది.

"ఓ! అసలు సిచుయేషన్ నీకు అర్థం కావటం లేదు, అరుణా. ఈ నెల రోజుల్లో చేయాల్సింది, చేసినా స్పెక్టాక్యులర్‌గా కనిపించేదీ, సినిమా కంపెనీ ప్రకటనలు, బట్టల కొట్టు ఏడ్స్ కీ కాంట్రాక్ట్సు కాదు, హీరో సైకిల్స్, పార్లే బిస్కట్స్, హెచ్. ఎమ్.టి. వాచెస్ లాంటి పెద్ద కంపెనీలని మన కంపెనీ డీలింగ్స్‌కి ఒప్పించాలి. మా డాడీని ఇంప్రెస్ చేయటమంటే మాటలు కాదు. ఇటీస్ నాటె జోక్."

"పోనీయండి" అంటూ ఆవలించింది అరుణ.

రఘురాంకి నిద్ర రావటం లేదు. తన భుజం మీద తల పెట్టుకుని కళ్ళు మూసుకున్న అరుణని తట్టి పిలిచాడు. "ఏదైనా మాట్లాడవోయ్.

పోనీ ఏదైనా కథ చెప్పు'' అన్నాడు మిల్లిగా.

అరుణ ఒక్క క్షణం ఆలోచించింది, జ్ఞాపకంలో ఒక మెరుపేదో తళుక్కుమంది. ''ఆ మధ్య ఏదో పుస్తకంలో చదివాను. ఇది జరిగిన కథేనట. అది చెప్తాను. ఒక టెలిగ్రాఫ్ ఆపరేటర్ని చిక్కని అడవి మధ్యనున్న ఒక చిన్న స్టేషనుకి వేశారు. అతని ఉద్యోగం నైట్ డ్యూటీతో మొదలయింది. అతనికి చీకటంటే చెప్పలేనంత భయం. మొదటి రోజు స్టేషనుకి ఇరవై మైళ్ళ దూరాన ఉన్న ఊరినుంచి ఒక గూడ్సు ట్రెయిన్‌లో వచ్చి దిగాడు సాయంకాలం ఆరున్నరకి. ఆ అడవి ప్రాంతంలో అప్పుడే బాగా చీకటి పడిపోయింది. ట్రెయిన్ కనుమరుగయేదాకా చూస్తూ నిలుచున్నాడు. తరవాత ఆఫీసు గదిలోకి వెళ్ళి ఉన్న ఒక్క కిరోసిన్ లాంపు వెలిగించుకున్నాడు. తలుపులు, కిటికీలు అన్నీ గట్టిగా బిగించుకుని, కిటికీలకు కర్టెన్స్ కూడా లాగేసి, టేబిల్ ముందున్న కుర్చీలో కూలబడి, తనతో తెచ్చుకున్న పాకెట్ విప్పి భోజనం చేశాడు.

''అంతా నిశ్శబ్దంగా ఉంది. మనుష్య సంచారానికి తను ఇరవై మైళ్ళ దూరంలో ఉన్నాడని గుర్తొచ్చింది హఠాత్తుగా. అంతే, సన్నగా వణుకు మొదలయింది అతనిలో. నిజానికి స్టేషనులో చేయాల్సిన పనికూడా అంతగా లేదు. వెంట తెచ్చుకున్న నవల పేజీలు తిరగెయ్య సాగాడు. బయట ఎండుటాకుల శబ్దం, చెట్ల కొమ్మల మధ్యలోంచి దూసుకుపోతున్న గాలి శబ్దం సైతం అతని నెర్వస్‌నెస్‌ని హెచ్చిస్తున్నాయి.

''ఏ అడవి మృగమో వచ్చి కిటికీ అద్దాలు పగలగొట్టి లోపలి కొచ్చేస్తే . . . ఎలా అని భయపడ్డాడు. ఇంతలో హఠాత్తుగా విసురుగా వీచిన గాలి కిటికీ రెక్క ఒకటి తెరుచుకుని, గుడ్డిగా వెలుగుతున్న దీపాన్ని గుప్పుమని ఆర్పేసి వెళ్ళిపోయింది. మళ్ళీ దాన్ని వెలిగించుకునే లోపల అతనికి ముచ్చెమటలు పోశాయి. మగతగా కాస్సేపు నిద్ర పోయినా, ఏవో పీడ కలలతో ఉలిక్కి పడుతున్నాడు. భయం! భయం! ఈ భయంతో తన నరాలు తెగి పిచ్చివాణ్ణయి పోతానేమో అనిపించింది. తెల్లవారి కొలీగ్ డ్యూటీకి రాగానే బతుకుజీవుడా అనుకున్నాడు. అలా నైట్ డ్యూటీ నూడా నెల చేయాలి. వారం గడిచింది రెండు వారాలయింది. ప్రాణం ఉద్యోగం వదిలేసిపోతే పోకలసిందే అనుకుంటూ రోజులు గడుపుతున్నాడు రోజు రోజుకీ భయం ఎక్కువవుతూనే ఉంది.

''ఆఖరి కొక రోజు సిగ్గు విడిచి, తన కొలీగ్‌ని అడిగేశాడు—'ఇంత ముందు నైట్ డ్యూటీ ఎలా చేసేవారు. ఈ చీకటి అడవిలో భయంతో పిచ్చెక్కేలా ఉంది నాకు'.

''అతను అర్థమయినట్లుగా నవ్వి, అని 'మీకు నిజంగా చీకటి అంటే ఏమిటో తెలిసినట్లు లేదు చీకటి మనిషికి శత్రువేం కాదు. బెదిరిన కుందేలులా స్టేషనులో తలుపులు బిగించుకుంటే, ఎప్పుడయినా మీ భయాన్ని, ఒంటరితనాన్ని జయించలేరు. కొంచెం ఫ్రీగా మూవ్ అయి, గమనించారంటే ఈ ప్రకృతి అంతా మనకి తోడుగా ఉందని తోస్తుంది అన్నాడు.

''ఆ రాత్రి స్టేషనులో దిగగానే లోపలికి పోలేదు అతను. కొంచెం సేపు అటూ, ఇటూ పచార్లు చేస్తూ ఉండి పోయాడు. బాగా చీకటయినాక గదిలో దీపం వెలిగించుకుని మళ్ళీ గుమ్మంలో నిలుచున్నాడు. లోపలికి వెళ్ళి బయట ఉన్న చీకటి నుంచి దూరంగా ఉండాలని మనసు పీకుతున్నా, బలవంతంగా అక్కడే వరండాలో నిలుచుని, అప్పుడే తొంగి చూస్తున్న ఆకాశంలోని నక్షత్రాలని లెక్కించ సాగాడు. అమావాస్య ముందు రోజులేమో, చుక్కల మధ్యలో నాను మాత్రంగా గీతలా ఉన్న చంద్రుడు తనని చూసి నవ్వుతున్నట్లనిపించింది.

''ఎదురుగా రైల్వే లైన్ల కవతల పది గజాల దూరంలో ఉన్న పెద్ద వూడల మర్రి ఒకటి నల్లగా భూతంలా కనిపిస్తోంది. చూడకూడదనుకుంటూనే అటుగా చూశాడు. చెట్టు మీద విశ్రమించిన పక్షి ఏదో పొరపాటున జారి ఆకుల్లోంచి కింద పడి కువకువ మన్నది. దాని వెంట మరో రెండు పక్షులు దిగాయి. కొంచెం సేపు శబ్దాలు చేసి, మామూలుగా ఆ చిరు వెలుగులో అతి కష్టంతో అందుబాటులో ఉన్న కొమ్మని ఎక్కాయి. ఇదంతా అతని కళ్ళకి చూచాయగా తెలుస్తోంది. వాటి శబ్దాలు వింటూ ఉన్నాడు. ప్రాణమున్న ఆ పక్షుల కదలికలు, శబ్దాలు అదొక చెట్టే కానీ, భూతం కాదని చెప్పక చెబుతున్నాయి. నెమ్మదిగా లోపలికి వెళ్ళి భోజనం చేశాడు.

''భోజనం పూర్తి చేసిన పేపర్ని వరండా అవతల పడేసి, చేయి కడుక్కుని ఇలు తిరిగా లోగా ఎక్కడి నుంచో చిన్న పిల్లి పిల్ల ఒకటి వచ్చి మెతుకుల్ని నాకటం మొదలు పెట్టింది. అలాగే చూస్తూ నిలుచుండి పోయాడు. తినటం అయ్యాక వచ్చి, వరండాలో తలుపు పక్కనే బైఠాయించింది పిల్లి. 'ఇదీ నాకు తోడు' అనుకుని నవ్వుకున్నాడతను. ఆ నాటి రోజు ఫియర్ కాంప్లెక్స్‌ని జయించటం అలా మొదలు పెట్టాడు. రాను రాను చుట్టూతా ఉన్న ప్రకృతి, చెట్లు, ఆకులు, అందులోని పిట్టలు, తాను మిగిల్చిన మెతుకులు తినే పిల్లి, ఆకాశం, నక్షత్రాలు, చంద్రుడు, చీకటి అన్నీ అతనికి స్నేహితులు అయిపోయినాయి.

''అదీ కథ. నాకు నిద్రొచ్చేస్తోంది'' అంటూ రఘురాం మెడ చుట్టూ ఒక చేయి వేసి, అతని చేతిని లాగి తన నడుం చుట్టూ వేసుకుని నిద్రలోకి జారుకుంది అరుణ, అరుణ్ని మాత్రం మళ్ళీ ఆలోచనల్లోకి తోసేసి.

పలచని నైట్గీ కిందున్న ఆమె శరీరపు సౌకుమార్యం తెలుస్తోంది రఘురాంకి. ఉచ్ఛ్వాస నిశ్వాసాల వల్ల చిన్నగా కదులుతున్న ఆమె గుండె మీద, మరింత గట్టిగా దగ్గిరికి లాక్కుని కళ్ళు మూసు కున్నాడు.

• • • •

మధ్యాహ్నం భోజనం చేసినప్పటినుంచీ తెగ వెయిట్ చేస్తోంది అరుణ, రఘురాం ఫోన్ కాల్ కోసం. ఆఖరుకి సాయంత్రం నాలుగ్గంటలకి మోగింది ఫోను. చేతిలో ఉన్న పుస్తకం అవతల పడేసి ఫోన్ అందుకుంది.

''హలో, అరుణ్. నా కెంత సంతోషంగా ఉందో చెప్పలేను. త్వరగా వచ్చేసి అన్నీ వివరంగా చెబుతాను. కానీ నువ్వు మాత్రం మంచి పిక్చర్ ఏదైనా సెలక్ట్ చేసి టికెట్స్ బుక్ చేయించు. ఓకే. . .''

''అలాగే. అసలింతకీ. . .''

''ఏమిటీ? అసలు, ఏమిటీ అంటున్నావ్? ఇవాళ సిండికేట్ బాంక్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ని మీట్ అయాను. అబ్బ! మొదట అపాయింట్‌మెంట్ తీసుకున్నప్పుడు ఏం మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో అని బెదిరి పోయాననుకో. అయితే మన కంపెనీ పేరు చెప్పి, సేల్స్ సూపరింటెండెంట్‌గా పరిచయం చేసుకోగానే అతనెంత గౌరవంగా మాట్లాడాడో తెలుసా? ఫ్రెండ్లీగా, పేరు దాకా పేరు చెప్పలేదు.''

''నిజం... రియల్లీ వండర్‌ఫుల్. అయితే ఒక సంవత్సరం కాంట్రాక్ట్ అయినా సెటిల్ అయిందా?'' ఆత్రతగా అడిగింది అరుణ.

''అబ్బ! అంత తొందరైతే ఎలాగోయ్. ఒక వారం కిందటే ఇంకో కంపెనీతో ఒప్పందం అయిపోయిందని చాలా ఫీలయాడు. అయినా సరే, నేను మన ప్రకటనల డిజైన్సు, టైప్సు అన్నీ చూపి, మన కంపెనీ రేట్లు అన్నీ వివరిస్తే చాలా ఇంప్రెస్ అయాడు. తప్పకుండా వచ్చే సంవత్సరం మన కంపెనీ తోనే డీల్ చేస్తామని అన్నారు. వెళ్ళిన పని ఫినిష్ అవకున్నా, ఇంత సంతోషంగా ఉన్నా డేమిటా అను కుంటున్నావా? బట్ యు సీ! ఇది ఓటమిలా అనిపించటం లేదు. నాకు. నా లోప లున్న భయం అనే దెయ్యాన్ని జయించా నివాళ. ఇది చాలు. రేస్ హార్స్‌లా ముందుకు పోగలను. బై దిబై, నా లోప లున్న డెవిల్ని పరిగెత్తించిన ఘనత నీదే సుమా!'' మాటలు వింటూ ఉంటే ఆనందంతో ఆమె కళ్ళు మసకబారి మెరిసినట్లయింది అరుణకి. *

